క్లుప్తంగా

ఉగాది క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ఎంఆర్సీ కార్యాలయం వద్ద సోమవారం మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్ త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి శ్రీకాళహస్తి సమితి అధ్యక్షుడు, ప్రధానోపాధ్యాయుడు చింత సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, సీఆర్పీలు జయంతి, ఈశ్వరయ్య, వాసవి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత మృతి



ఖాదర్ బాయ్ (ఫైల్)

పిచ్చాటూరు: పట్టణ సీపీఐ మాజీ అధ్యక్షులు ఖాదర్ బాయ్(70) అనారోగ్యంతో సోమవారం వేకువజామున మృతి చెందారు. ఖాదర్ తన చివరికాలం కూడా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించారు. వివిధ పార్టీల నాయకులు ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన చివరి క్షణం వరకు కమ్యూనిస్టు భావజాలంతోనే ఆయన జీవించారని బంధువులు, ఆయన సన్నిహితులు తెలిపారు.

పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

సత్యవేడు: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఎంఈఓ కే. రవి తనిఖీ చేశారు. సోమవారం మండలంలో 6–9 తరగతులు విద్యార్థులకు సంగ్రహణాత్మక మూల్యాంకన హిందీ పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం వాణి, డివి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న రాజవర్ధన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి మేనేజరు రాజవర్ధన్ రెడ్డి సోమవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎండలకు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు చిట్టెం, డీపీఎస్‌రావు, వైడీ కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


గడ్డివామి దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డివామి

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక పొలాల్లో సోమవారం గడ్డివామి దగ్ధమైంది. గ్రామస్తుల కథనం.. మేర్లపాక గ్రామానికి చెందిన సురేష్ తన పొలంలో గడ్డిని యంత్రం ద్వారా కట్టి మోపులు నిల్వ చేశాడు. సోమవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు వామికి నిప్పు పెట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 120 గడ్డి మోపులు కాలిపోయాయి. సుమారు రూ.70 వేల మేర నష్టం వాటిల్లింది.

విక్రమ్ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని విక్రమ్ నెక్స్‌జన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు మ్యాథ్స్ ఒలంపియాడ్, సైన్స్ ఒలంపియాడ్‌లో ప్రతిభ చూపారు. 2023–24 సంవత్సరాన్ని విద్యార్థులు బంగారు పతకాలు, నగదు బహుమతి, సర్టిఫికెట్లు, బుక్స్ సాధించారు. వీరిని డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, కరస్పాండెంట్ మునిలక్ష్మి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవను రాజకీయం చేయొద్దు

శ్రీకాళహస్తి: సేవను రాజకీయం చేయొద్దని ప్రముఖ కలంకారీ కళాకారుడు నిరంజన్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ తాను తొట్టంబేడు మండలం ఎంపీడీవో కార్యాలయం సమీపంలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. తన తండ్రి జ్ఞాపకార్థం గత కొన్ని సంవత్సరాలుగా రంజాన్ మాసంలో తమ సంస్థలో పనిచేసే ముస్లిం మహిళలకు చీరలు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సేవకు రాజకీయాలతో సంబంధం లేదన్నారు. ఎన్నికల కోడ్ నిబంధన అమల్లో ఉన్న విషయంపై అవగాహన లేదని ముందుగా అధికారుల వద్ద అనుమతి పొందలేదన్నారు. దయచేసి మన్నించాలని కోరారు.

జగనన్న గెలుపు | చారిత్రక అవసరం

- సత్యవేడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్
- కేవీబీపురం మండలంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం



కేవీబీపురం మండలం సదాశివపురంలో స్థానిక పార్టీ నాయకులతో చర్చిస్తున్న ఎంపీ గురుమూర్తి

కేవీబీపురం(వరదయ్యపాళెం): రాష్ట్రానికి అన్ని విధాలా మేలు జరగాలంటే మరోసారి జగనన్న ముఖ్యమంత్రి కావాల్సిన చారిత్రాత్మక అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ అన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజలతో కలసి సోమవారం కేవీబీపురం మండలంలోని దిగువ పుత్తూరు, కోటమంగాపురం, ఎగువ పుత్తూరు, మిద్దికండ్రిగ, జ్ఞానమ్మకండ్రిగ, శ్రీనివాసపురం, సదాశివపురం, వడ్డికండ్రిగ, సిద్ధమనాయుడుకండ్రిగ, బొజ్జయ్యకండ్రిగ, సరస్వతిపురం, బంగారమ్మకండ్రిగలో ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు. పథకాలన్నీ కొనసాగాలంటే ప్రజలందరూ జగనన్న ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు వివరించారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసినట్లు ప్రజలకు చెప్పారు. ఇలాంటి ప్రభుత్వానికి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మే 13న ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీకి ఘన విజయం చేకూర్చాలని కోరారు.

సదాశివపురంలో పర్యటించిన ఎంపీ గురుమూర్తి

మండలంలో విస్తృతంగా ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యని ఎంపీ మద్దెల గురుమూర్తి సదాశివపురంలో కలిశారు. ఎన్నికల ప్రచార తీరు, పార్టీ పరిస్థితుల గురించి స్థానిక నాయకులతో చర్చించారు. అనంతరం స్థానికులు, యువతతో కలసి సత్యవేడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థితోపాటు తిరుపతి పార్లమెంటు బరిలో ఎంపీ అభ్యర్థిగా ఉన్న తననూ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మి నందకుమార్, జెడ్పీటీసీ మునెమ్మ సుబ్బయ్య, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, వైస్ ఎంపీపీలు సరస్వతి, శ్రీనివాస్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రామ్మోహన్ వర్మ, మాజీ జెడ్పీటీసీ డేవిడ్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ అరుణ్‌కుమార్, బీసీ సెల్ మండల కన్వీనర్ హరిబాబు, స్థానిక ఎంపీటీసీలు అల్లెయ్య, సుబ్బయ్య, మోహన్ నాయుడు, స్థానిక సర్పంచులు రాజేంద్ర, తిరుపాల్ యాదవ్, బాలాజీ, రాజేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.





కోటమంగాపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్, కేవీబీపురం మండలం ఎగువ పుత్తూరులో ప్రచారం చేస్తున్న నాయకులు

రైల్వే పోలీసు పేరుతో డబ్బులు డిమాండ్

నాగలాపురం: మండల కేంద్రమైన నాగలాపురంలో రైల్వే పోలీసు అంటూ డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిని స్థానిక పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ ఓబయ్య కథనం.. గత బుధవారం ఓ వ్యక్తి నాగలాపురం పోలీసు స్టేషన్‌కు ఆనుకొని ఉన్న ఓ ఇంటర్నెట్ సెంటరుకు ద్విచక్ర వాహనంలో వచ్చాడు. చెన్నై ఎగ్మూర్ నుంచి తిరుచురపల్లికి ఆన్‌లైన్‌లో బుక్ చేయాలంటూ షాపు నిర్వాహకుడిని కోరాడు. టికెట్ బుక్ చేశాక మళ్లీ క్యాన్సల్ చేయాలని చెప్పాడు. అంతేకాకుండా తాను ఆర్పీఎఫ్ పోలీసు అని, మీకు టికెట్ బుక్ చేయడానికి అనుమతి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. అనుమతి లేకుండా బుకింగ్ చేసినందుకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని బెదిరించాడు. ఆపై తన ఎస్ఐ పక్కనే ఉన్నాడని, ఆయన ఖర్చులకు రూ.2 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీనిపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి



వివిధ పార్టీల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామాంజనేయులు

సత్యవేడు: సార్వత్రిక ఎన్నికల పకడ్బందీగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని తహసీల్దార్ రామాంజనేయులు కోరారు. సోమవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించరాదని, ప్రచార కార్యక్రమాలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఇంటింటా ప్రచారం, కరపత్రాల పంపిణీ..ఇత్యాది వాటికి రాజకీయపార్టీలు, అభ్యర్థులు తప్పనిసరిగా అనుమతి పొందాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో హోర్డింగ్స్, ఫ్లెక్సీలు, బ్యానర్లు ఉండకూడదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ఆర్పీలు, వలంటీర్లు రాజకీయ నాయకుల ర్యాలీలు, ప్రచారాల్లో పాల్గొనరాదన్నారు. సినిమా థియేటర్లలో ఎన్నికల ప్రచార ప్రకటనలకు కూడా రాజకీయ పార్టీల నేతలు, థియేటర్ మేనేజ్‌మెంట్ తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. నామినేషన్ వేసే చివరి రోజు వరకు ఓటర్ల నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దీన, సీపీఎం నాయకులు జనార్దన్, రమేష్, డీటీ రవిచంద్ర, వీఆర్ఓ సురేష్, సిబ్బంది సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో హక్కులు సాధించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న వైవీ రమణయ్య

తిరుపతి కల్చరల్: ముదిరాజ్‌లందరూ ఐక్యతతో సాగుతూ సమష్టి కృషితో హక్కులు సాధించుకుందామని ముదిరాజ్ సంఘం శ్రీకాళహస్తి నియోజకవర్గం అధ్యక్షుడు వైవీ రమణయ్య పిలుపు నిచ్చారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ముదిరాజ్ సామాజిక వర్గం అన్ని రంగాలలో వెనుకబడి అభివృద్ధికి నోచుకోలేకపోయిందని తెలిపారు. అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రాలైన తిరుపతి, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో తమకు స్థలం కేటాయించి ముదిరాజ్ భవన సదుపాయాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. నామినేటెడ్ పదవులలో ముదిరాజ్‌లకు అవకాశం కల్పించి వారి రాజకీయ ఎదుగుదలకు కృషి చేయాలని కోరారు. ముదిరాజ్ సంఘ నేతలు జి.గోవిందస్వామి, ఆకుల గురుమూర్తి, ఆర్.సుబ్రమణ్యం, జి.రాజా, కె.ఈశ్వర్ పాల్గొన్నారు.

భాషపై పట్టు సాధిస్తేనే విజయం



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారావు

శ్రీకాళహస్తి: భాషపై పట్టు సాధిస్తే విజయానికి మార్గం సుగమం అవుతుందని హైదరాబాద్‌కు చెందిన మోటివేటర్ చెన్నూరు కృష్ణారావు అన్నారు. పట్టణంలోని ది స్కూల్లో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులను ఉత్తేజపరిచే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ప్రేరణ కలిగించే విధంగా మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే తనను తాను నియంత్రించుకోగలిగితే, ఎలాంటి ప్రలోభాలకు ఆవేశాలకు లోనుకాకుండా అనుకున్నవి సాధించవచ్చని ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జనార్దన్‌రావు పవార్, ప్రధానోపాధ్యాయురాలు విశాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా అమావాస్య ఉత్సవం



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం వైభవంగా అమావాస్య ఉత్సవం నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించి సుందరంగా అలంకరించారు. అనంతరం వేదమంత్రాలు, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. పురవీధుల్లో ఊరేగుతున్నస్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు తెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పీవీరోడ్డులో వెలసిన అంకాళమ్మ ఆలయం వద్ద సోమవారం అమావాస్యను పురస్కరించుకుని నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ రెండేళ్లుగా ప్రతి అమావాస్యకు భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్‌రావు, యశ్వంత్‌రావు, ఉమేష్‌రావు, క్రాంతికుమార్, డాక్టర్ కృపానిధి, ఉపేందర్‌రెడ్డి, రాఘవేంద్ర, సావిత్రిబాయి, మాధవ, సాయి, సుశీల, బాబు, వినీత్‌రెడ్డి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం స్వీకరిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి తొట్టంబేడు మండలం చిన్నకన్నలికి చెందిన కిలారి శ్రీనివాసులునాయుడు సోమవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరదరాజస్వామికి వస్త్రాల సమర్పణ



దుస్తులు అందజేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన శ్రీప్రసన్న వరదరాజస్వామి ఆలయానికి శ్రీ జైసుబ్రహ్మణ్యస్వామి ట్రస్టు ఆధ్వర్యంలో ఉగాదిని పురస్కరించుకుని సోమవారం వస్త్రాలు సమర్పించారు. వీటిని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న అర్చకులు, సిబ్బందికి దుస్తులు అందజేశారు. ట్రస్టు సిబ్బందిని పాలకమండలి చైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఏకలవ్య'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో కనమనంబేడులోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి అర్హులైన ఎస్టీ విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ దామోదర్ నాయుడు కోరారు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారికి సీట్లు కేటాయిస్తామన్నారు.

శ్రీసిటీలో కనీస వసతులపై ప్రశంసలు



శ్రీసిటీలో ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ సీఈఓ ఆదర్శ్ రాజేంద్రన్

శ్రీసిటీ(వరదయ్యపాళెం): రాష్ట్ర ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ సీఈఓ ఆదర్శ్ రాజేంద్రన్ సోమవారం శ్రీసిటీని సందర్శించారు. ఆయనకు శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్ సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతల గురించి వివరించారు. శ్రీసిటీలోని పారిశ్రామిక అనుకూల వాతావరణం, మౌలిక వసతులను పరిశీలించిన రాజేంద్రన్ దేశంలోని ఇతర పారిశ్రామికవాడలకు ఇది ఒక ఉత్తమ మోడల్‌గా నిలుస్తుందని ప్రశంసించారు. అనంతరం ఆయన శ్రీసిటీ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ శ్రీసిటీలో ఇంజినీరింగ్, ఏసీ తయారీ, ఇతర రంగాలకు చెందిన 40 దాకా చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉన్నాయని, వాటిలో కొన్ని భారీ పరిశ్రమలకు అనుబంధ సరఫరా గొలుసు కంపెనీలుగా ఉన్నట్లు వివరించారు. శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లోని భారీ పరిశ్రమలకు సేవలందించే విధంగా మరిన్ని చిన్న, మధ్యతరహా అనుబంధ కంపెనీలను నెలకొల్పేలా ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆయన ప్రతిపాదించారు. అలాగే శ్రీసిటీలోని రెడీ బిల్ట్ ఫ్యాక్టరీలు లీజు విధానాల గురించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన శ్రీసిటీని మోండలెజ్, ఎంఎస్ఆర్ గార్మెంట్స్, అడేలా ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలను సందర్శించారు. ఆయన వెంట పరిశ్రమలశాఖ సహాయక సంచాలకులు రామ్మూర్తి ఉన్నారు.

ఫ్యాను గుర్తుకు ఓటు.. సంక్షేమానికి రూటు





ఇసుకతాగేలి వాసులతో ఎంపీ గురుమూర్తి, అంజిమేడులో ఎంపీని సన్మానిస్తున్న నాయకులు

ఏర్పేడు: ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధిని చూసి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని తిరుపతి ఎంపీ గురుమూర్తి కోరారు. ఆయన సోమవారం ఇసుకతాగేలి, అంజిమేడు, పంగూరు గ్రామాల్లో మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. విభజన తర్వాత అధికారం చేపట్టిన చంద్రబాబు రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకున్నారని తెలిపారు. మేనిఫెస్టోను బుట్టదాఖలు చేసి ఒక్క హామీని నెరవేర్చలేదని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ మోసం చేసేందుకు సిద్ధమయ్యాడని వివరించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీని ఆదరించి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఉపయోగపడే ఒక్క పథకమైనా చంద్రబాబు ప్రవేశపెట్టారని నిలదీశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు శ్రీనివాసులు, జనార్ధన్‌రెడ్డి, సర్పంచులు తాతేకాల్వ మోహన్‌రెడ్డి, గురవమ్మ, లక్ష్మీప్రసన్న, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, మాజీ అధ్యక్షుడు గురవారెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ కరీముల్లా, నాయకులు లోకనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మునిరెడ్డి, మోహన్‌రెడ్డి, బాలగురునాథంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, మహేష్, రామయ్య ఆచా పాల్గొన్నారు.

నేడు ఉగాది కవి సమ్మేళనం



శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో పుష్పాలంకరణలో నిమగ్నమైన సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఈవో ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మేడసాని మోహన్ ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటలకు ఆలయం వద్ద ఆలయ ఆస్థాన సిద్ధాంతి కరణం లక్ష్మీనారాయణశర్మ వారిచే పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు. భక్తులు, పుర ప్రముఖులు హాజరు కావాలని ఈవో కోరారు.

ఆలయం ముస్తాబు

శ్రీకాళహస్తీశ్వరాలయం క్రోధినామ సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ముస్తాబు చేస్తున్నారు. ఆలయ ముఖద్వారాల వద్ద, ధ్వజస్తంభాలకు రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. ఈ అలంకరణలు భక్తులను ఆకట్టుకునే విధంగా ఉన్నాయి.

నేటి కార్యక్రమాలు

- ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉగాది పచ్చడి భక్తులకు వితరణ
- ఉదయం 9 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అభిషేకం, అలంకార నైవేద్యం, భక్త కన్నప్పకు సారె
- సాయంత్రం 4 గంటలకు ఆస్థాన సిద్ధాంతిచే పంచాంగ శ్రవణం, 7 గంటలకు కవి సమ్మేళనం
- రాత్రి 8 గంటలకు స్వామి అమ్మవార్ల పురవీధుల ఊరేగింపు